క్లుప్తంగా

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శుక్రవారం తెలిపారు. మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన తానేటి ఇందిరా ప్రియదర్శినికి కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన సతీష్‌తో వివాహమైంది. ఇటీవల తన భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు కట్నం కోసం వేధిస్తున్నారంటూ బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు



పందలపర్రులో పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మూర్తిబాబు, స్థానిక నాయకులు

నిడదవోలు రూరల్: రానున్న వేసవిలో తాగునీటి కొరత లేకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీఓ టి.మూర్తిబాబు అన్నారు. మండలంలోని పందలపర్రులో రక్షిత మంచినీటి పైపులైన్ ఏర్పాటు పనులను శుక్రవారం ఎంపీడీఓ మూర్తిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందలపర్రులో ఎంతోకాలంగా ఉన్న పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ సాధారణ నిధులతో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులుమంతుల రామారావు, సచివాలయ కార్యదర్శి జి.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు: టీవీఎస్ మోపెడ్‌పై అక్రమంగా తరలిస్తున్న 100 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టణంలో లాంచీల రేవు వద్ద శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజు తెలిపారు. మండలంలోని ఆరికిరేవుల నుంచి రాజమహేంద్రవరం తరలిస్తున్న ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు. ఈ కేసులో సీతంపేట గ్రామానికి చెంది ఉజ్జిన లక్ష్మీనారాయణ అనే నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సీఎస్ టీడీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు.

లంపీ స్కిన్ వ్యాధి నివారణకు అందుబాటులో వ్యాక్సిన్



రైతు సలహా మండలి సమావేశంలో పాల్గొన్న అధికారులు

నల్లజర్ల: కాప్రి ఫాక్స్ అనే వైరస్ ద్వారా పశువులకు వచ్చే లంపీ స్కిన్ డిసీజ్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ నల్లజర్ల అసిస్టెంట్ డైరెక్టర్ జాన్ మోజేష్ వెస్లీ సూచించారు. నల్లజర్ల ఆర్బీకేలో శుక్రవారం రైతు సలహా మండలి సమావేశం జరిగింది. ఏడీఏ వెస్లీ మాట్లాడుతూ రైతులు ముందస్తుగా తమ పశువులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లోనూ ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. ఈ వ్యాధి వచ్చే అవకాశాలు తెల్లని పశువులకు ఎక్కువ అన్నారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను కోరారు. పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర, విత్తనాలు మార్చి నెలాఖరులోగా సబ్సిడీపై అందించాలన్నారు. సబ్సిడీపై డ్రిప్, తుంపర సేద్యం పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఉద్యానశాఖాధికారి శ్రీలక్ష్మి అన్నారు. ఏవో కె.కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకులు పామర్తి దుర్గా సురేష్, యు.అనూష, రామకృష్ణ, ప్రభాకరరావు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే

ఉండ్రాజవరం: మండలంలో చిలకపాడు పంచాయతీలో శుక్రవారం చేపట్టిన భూముల రీ సర్వేను సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ నాగరాజు మాట్లాడుతూ సమగ్ర భూముల సర్వేతో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూముల సరిహద్దు సమస్యలు పరిష్కరమవుతాయన్నారు. భూముల రీసర్వేలో సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు తిరుమళ్ళ నాగపార్వతి, పింగ్రా పోసేశ్వరరావు, సెక్రటరీ రఘునందనరావు, వీఆర్వో చిట్టిబాబు, సర్వేయర్ మారుతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

చాగల్లు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో వి.ఖాదర్‌బాబు పర్యవేక్షించారు. చిన్నారులకు కంప్యూటర్‌పై తెలుగు అక్షరాల , పదాలను బోధించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో 13న పోలింగ్
- బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహణ
- బందోబస్తుకు 240 మంది పోలీసులు



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించే కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయం

కొవ్వూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కొవ్వూరు డివిజన్‌లోని ఓటర్లు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి. బ్యాలెట్ పత్రాల ద్వారా పోలింగ్ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల నిర్వహణకు తహసీల్దార్ కేడర్ స్థాయి అధికారులు ఐదుగురికి పోలింగ్ విధులు కేటాయించామని సహాయ ఎన్నికల అధికారి, కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు చెప్పారు. బందోబస్తులో భాగంగా ఇప్పటికే డీఎస్పీ వీఎస్ఎన్ వర్మతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఇప్పటికే గుర్తింపుకార్డులు జారీ చేశారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం (ద్వారకా తిరుమల మండలం మినహా) నియోజకవర్గాల్లో 242 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లకు, స్థానిక ఎమ్మెల్యేలకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ నెల 13 ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. ఇప్పటికే బ్యాలెట్ పత్రాల వెరిఫికేషన్ పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బ్యాలెట్ పత్రాలు భద్రపరిచారు.

మొత్తం ఓటర్లు : 242 — డివిజన్‌లో పార్టీల పరంగా సంఖ్యా బలాలు ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	వైఎస్సార్ సీపీ	టీడీపీ	జనసేన	ఇతరులు	బీజేపీ
నిడదవోలు	94	77	9	8	0	0
గోపాలపురం	67	60	6	1	0	0
కొవ్వూరు	81	61	13	5	1	1
మొత్తం	242	198	28	14	1	1

(నోట్: మునిసిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేల ఓట్లతో కలిపి)

వైఎస్సార్ సీపీదే పైచేయి

డివిజన్‌లోని మొత్తం 242 ఓటర్లలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులే 198 మంది ఉన్నారు. తాళ్లపూడి, దేవరపల్లి, నిడదవోలు మండల పరిషత్‌లలో టీడీపీకి చెందిన ఒక్క ఎంపీటీసీ సభ్యుడు కూడా లేడు. మొత్తం తొమ్మిది జెడ్పీటీసీ స్థానాలూ వైస్సార్ సీపీ ఖాతాలోనే పడ్డాయి. మూడు నియోజకవర్గాల్లో కలిపి టీడీపీకి 28 మంది, జనసేనకు 14 మంది, స్వతంత్రుడు ఒకరు, బీజేపీ తరఫున ఒక కౌన్సిలర్ ఓటర్లు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,105 మంది ఓటర్లలో అత్యధిక శాతం మంది వైఎస్సార్ సీపీ చెందిన ప్రజాప్రతినిధులే. విపక్షాల నుంచి కేవలం 170 మంది మాత్రమే ఉన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల విజయం లాంఛనమే అని చెప్పవచ్చు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



ఈనెల 13న నిర్వహించే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం . ఓటర్లు కేవలం పోలింగ్ కేంద్రంలో ఇచ్చిన పెన్‌తో మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాలి.పోలింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించేలా పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తాం. పోలింగ్ విధులకు ఐదుగురు సిబ్బందికి కేటాయించాం. ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశాం.

–ఎస్.మల్లిబాబు, సహాయ ఎన్నికల అధికారి, ఆర్డీవో, కొవ్వూరు

బందోబస్తు ఏర్పాట్లు చేశాం



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు 240 మందిని నియమించాం. ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, 47 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 131 మంది కానిస్టేబుళ్లు, నలుగురు మహిళా కానిస్టేబుళ్లు, 24 మందితో రెండు స్పెషల్ టీములు ఏర్పాటు చేశాం.ప్రధాన ప్రాంతాల్లో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. పోలింగ్ బాక్సుల తరలింపు, బ్యాలెట్ పత్రాల తీసుకురావడానికి ఎస్కార్ట్ టీము పనిచేస్తుంది.

– వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ, కొవ్వూరు

108 కలశాలతో షిర్డీసాయికి అభిషేకాలు



పూజలు అందుకుంటున్న షిర్డీ సాయినాథుడు

నల్లజర్ల: అనంతపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు మూడో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభం అయ్యాయి. పుణ్యాహవచనం, మహాన్యాసం అనంతరం వేద పండితులు పుల్లాబొట్ల ధర్మరాజుశర్మ (రాజమహేంద్రవరం)వారిచే సర్వతో భద్ర మండలార్చన నిర్వహించారు. అలాగే బాబాకు 108 కలశాలతో జీవనదుల పుష్కర జలాలతో విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన చేశారు. భజన, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై బాబాను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హుకుంపేటలో సువాసినీ యాగం

గోపాలపురం: మండలంలోని హుకుంపేట హోతా శ్రీరామచంద్రమూర్తి ఇంటి వద్ద శుక్రవారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ గోపూజ, సువాసినీ యాగం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం నుంచి చండీయాగం , హోమం, గోపూజ నిర్వహిస్తారు. అనంతరం స్వామీజీ కొవ్వూరుపాడు ఎస్టేట్‌ను సందర్శించి భక్తులను కలుస్తారని హోతా శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

ఆయిల్‌పామ్ కార్మికుల ఆందోళన



యర్నగూడెంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

దేవరపల్లి: ఆయిల్ పామ్ గెలలు కోసేందుకు వినియోగించే పనిముట్లను సబ్సిడీపై సరఫరా చేయాలని ఆ గెలలు కోసే కార్మికులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కోరారు. యర్నగూడెం వద్ద గల 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పరిధిలోని ఆయిల్ పామ్ తోటల్లో గెలలు కోస్తున్న కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ కార్మికుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యర్నగూడెంలోని ఫ్యాక్టరీ వద్ద పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ కార్మికులు చెట్లు ఎక్కే సమయంలో పాములు, తేళ్లు, జర్రెలు, వంటి విష పురుగుల కాటుకు గురవుతున్నారన్నారు. ఇటీవల యర్నగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో నలుగురు కార్మికులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు ఆయన తెలిపారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య ఖర్చులు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు తుమ్మల సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు ఎం. భరత్ కుమార్, ఎం. శ్రీను, గోపి, ఆంజనేయులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రోగి వైద్యానికి మానవత సంస్థ ఆర్థిక సాయం

నల్లజర్ల: నల్లజర్లకు ముత్తిన పవన్‌సాయి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సంస్థ మండల శాఖ రూ.20 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ మొత్తానికి అదనంగా మానవత సంస్థ సభ్యులు కండెపు వెంకటసూర్యనారాయణ, గుత్తికొండ వరప్రసాద్, భోగవల్లి వెంకట సుబ్బారావు , పాతూరి సత్యనారాయణ, గుళ్ళపూడి వెంకటరత్నం, ఐడీవీ అప్పారావు మరో రూ.13 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తం రూ.33 వేలను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌సాయికి శుక్రవారం అందజేశారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి..

ఇటీవల అయ్యవరంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అల్లే గణేష్ కుటుంబానికి మానవత సంస్థ మండల శాఖ రూ.3 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేసింది. అలాగే అయ్యవరం గ్రామ దాతలు దెయ్యాల మల్లేశ్వరి 25 కిలోల బియ్యం, గుడిశే శివకృష్ణ 5 కిలోల మంచి నూనె అందజేశారు.



ముత్తిన సాయి పవన్‌కు రూ.33 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

13న 'మానవత' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడిలోని సొలస దమయంతి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు. వైద్య శిబిరం కరపత్రాలను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు సింహాద్రి జనార్దన రావు చేతుల మీదుగా శుక్రవారం విడుదల చేశారు. ఏలూరు ఆశ్రం హాస్పిటల్ వైద్యులు ఈ శిబిరంలో జనరల్, ఆర్థోపెడిక్, చెవి, ముక్కు, గొంతు, గైనిక్, కంటి, చర్మ, ఊపిరితిత్తులు వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు.

విద్యార్థులకు వ్యక్తిగత నైపుణ్యం కీలకం



ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో సుంకవల్లి ఫౌండేషన్ సభ్యులు

నిడదవోలు రూరల్: విద్యార్థులకు వ్యక్తిగత నైపుణ్యాలే కీలకమని ఓఎన్‌జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.దేవ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. సుంకవల్లి ఫౌండేషన్ ఛైర్మన్ వెంకన్న చౌదరి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమార్, అధ్యాపకుడు టి.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఆస్తులపై విచారణ చేపట్టాలి



కొవ్వూరులో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కొవ్వూరు: దేశ వ్యాప్తంగా ఉన్న అదానీ ఆస్తులపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు మార్టిన్ లూథర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ డిమాండ్‌తో ఈనెల 6 నుంచి 10 వరకూ అన్ని నియోజకవర్గాల్లోను, బ్లాకులలో పార్టీ నిరసన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీకి ఎస్‌బీఐ, ఎల్ఐసీలు అధిక మొత్తంలో రుణాలు ఇవ్వడంపై మండిపడ్డారు. 30న రాజమహేంద్రవరంలో పార్టీ జిల్లా స్థాయి శ్రేణులతో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరిగెల అరుణకుమారి, రాష్ట్ర కో–ఆర్డినేటర్ ముళ్ల మాధవ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, పార్టీ నిడదవోలు, గోపాలపురం నియోజకర్గాల ఇన్‌చార్జ్‌లు పెద్దిరెడ్డి సుబ్బారావు, జాస్తి సతీష్ తదితరులు మాట్లాడారు. అంతకుముందు ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొణిదెల శ్రీనివాస్, పీసీసీ డెలిగేట్ గెడ్డం సాయిబాబా, పార్టీ తాళ్లపూడి మండలశాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు,అందే వెంకట నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ పద్మావతి
- నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై అవగాహన కార్యక్రమాలు



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న నిడదవోలు మునిసిపల్ కమిషనర్ కేవీ పద్మావతి



గోపాలపురంలో అంగన్‌వాడీలకు నులి పురుగుల నివారణ మాత్రలు అందిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీదేవి

నిడదవోలు రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. ఈనెల 14న నిర్వహించే నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆమె సమీక్ష జరిపారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. వైద్యులు పి.హేమలత, కె.భాగ్యశ్రీలు కార్యక్రమ నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల వల్లే రక్తహీనత

కొవ్వూరు: కడుపులో నులి పురుగులు చేరిన పిల్లలు, కిషోర బాలలు రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి నీరసించి పోతారని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కె.సత్య అన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంపై స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పట్టణంలో 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసు వారికి ఈనెల 14న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఈ వయసు వారు పట్టణంలో 8,899 మంది ఉన్నారన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల చిన్నారులకు అర ట్యాబ్లెట్, రెండు నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి ఒక ట్యాబ్లెట్ వేయాలన్నారు. విద్యార్థులు కూడా ఈ ట్యాబ్లెట్ వేసుకోవాలని కమిషనర్ బి.శ్రీకాంత్ సూచించారు.మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో 6,077 మంది

దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో 6,077 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాల్సి ఉందని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ నెల 14న ట్యాబ్లెట్ వేసుకోని వారికి 18న మాత్రలు అందజేస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాత్రల అందజేత

గోపాలపురం: అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు హుకుంపేట పీహెచ్‌సీ డాక్టర్ జె.శ్రీనివాస్ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులతో ఈ మాత్రలు మింగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, అన్నదేవరపేట పీహెచ్‌సీ డాక్టర్ పి స్వర్ణలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి: నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పెరవలి, తణుకు, ఉండ్రాజవరం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. పెరవలి పీహెచ్‌సీ డాక్టర్ కె.విజయ్‌కుమార్, సీడీపీఓ శ్రీలక్ష్మి తమ ప్రసంగాల్లో 19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు కె.కాంతికుమారి, పి. వరలక్ష్మి, వి.కృష్ణకుమారి, వి.వనజాక్షి, సీహెచ్ వెంకటలక్ష్మి, వి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: నులి పురుగుల నివారణ కార్యక్రమంపై ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి, సీహెచ్ఓ ఎం. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు మింగడం వలన కడుపులోని నులి పురుగులు చనిపోయి రక్తహీనత రాకుండా నివారిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పీవీఎస్ నాగరాజు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సావిత్రీబాయికి ఘనంగా నివాళి



నిడదవోలులో సావిత్రీబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడదవోలు రూరల్: సమాజంలోని అన్ని రుగ్మతలనూ విద్యతోనే నివారించవచ్చని నిరూపించిన సావిత్రీబాయి పూలే బాటలో అందరూ విద్యావంతులు కావాలని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతిని శుక్రవారం నిడదవోలు శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. సావిత్రీబాయి చిత్ర పటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, సర్పంచ్ వెలగన నరేష్, కౌన్సిలర్లు కామిశెట్టి సత్తిబాబు, పువ్వల రతీదేవి, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: సావిత్రీబాయి పూలే వర్ధంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి సావిత్రీబాయి గొప్ప సంఘ సంస్కర్త, రచయిత్రి అని కొనియాడారు. తొలుత పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.